



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ప్రకాశం

బాపట్ల

సోమవారం | 21 జులై 2025 | పేజీలు 8


# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి





**సమస్యలను సత్వరమే పరిష్కరించేలా శ్రద్ధ చూపాలి**

**గ్రామాల్లో పచ్చదనం, పారిశుద్ధ్యం పెంపొందించాలి**

**త్వరలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ**

**మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశం**

టంగుటూరు, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఎంపీడీఓలు, ఎమ్మార్వోలతో మంత్రి స్వామి విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రెవిన్యూ సమస్యలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం,వీధి లైట్లు వంటి ప్రజా సమస్యలపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే సమస్యలు పరిష్కరించాలి, రైతుల భూసమస్యలు, ఆన్లైన్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి. గ్రామాల్లో పచ్చదనం, పారిశుద్యాన్ని పెంపొందించాలి. డ్రెయిన్లు, కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీయాలి. గ్రామాల్లోని అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చెయాలి. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి స్వామి అన్నారు.

**త్వరలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ**

డా.బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ కేంద్రాల ద్వారా పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం,తిరుపతి కేంద్రాలుగా బ్యాంక్ పివో, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ ఎస్సి,ఎస్టీ యువత వినియోగించుకోవాలని మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సూచించారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

**ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**

**సుపరిపాలనలో తొలి అడుగులో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల**



గిద్దలూరు, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాచర్ల మండలం ఆకవీడు

మిగతా 6లో




# ఒంగోలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**లయన్స్ క్లబ్‌కు సహకారం అందిస్తా**

**త్వరలో ట్రంకు రోడ్డు విస్తరణ పనులను చేపడతాం**

**ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్**

**లయన్స్ సిటిజన్స్ 39వ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : లయన్స్ క్లబ్‌కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ అన్నారు. నగరంలోని సంతపేట కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం లయన్స్ సిటిజెన్ 39 వ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. క్లబ్ అధ్యక్షుడు లయన్ చలువాది శ్రీహరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ హాజరైయ్యారు. ఆయన సమక్షంలో నూతన అధ్యక్షుడుగా పబ్బిశెట్టి రాజేష్, కార్యదర్శిగా అపోలో ఆనంద బాబు, కోశాధికారి ఆర్ఎస్ ఫ్యాషన్ శ్రీనులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సేవా రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరున్న లయన్స్ క్లబ్ ఒంగోలు ప్రజలకు మంచి సేవనందించాలని నూతనంగా ఎన్నుకోబడిన




కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. క్లబ్‌కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్, డిజేఆర్ ట్రస్ట్ సంయుక్తంగా చేపట్టిన పలు

మిగతా 6లో

# మాజీ మంత్రి శిద్దాకు యుటిఎఫ్ కృతజ్ఞతలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: చీమకుర్తి మండలం విద్యాసదస్సుకు సహకారం అందించిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు యుటిఎఫ్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని శిద్దా రాఘవరావు నివాసంలో ఆయన్ను కలిసి విద్యాసదస్సు విజయవంతానికి సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న కృషికి ఎల్లవేళలా తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావును యుటిఎఫ్ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఎన్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి చలువాది శ్రీనివాసరావు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎస్.కె శిలార్, బి.ఆంజనేయులు, ఎం.నాగార్జున, కొప్పర్తి శ్రీను పాల్గొన్నారు.





సంతనూతలపాడు గ్రామం అంబేద్కర్‌కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



సూర్య www.suryaa.com



# రైతుల అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీని ఆధునీకరించండి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండల పరిధిలోని కనగాల అప్ ల్యాండ్ రైతుల అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ కాలువను ఆధునికరించాలని భట్టిప్రోలు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే నక్క ఆనందబాబుకు విన్నవించారు.ఆదివారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో ఆనందబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన టిడిపి శ్రేణులు,ఆయనకు పలు విషయాలను వివరించారు.కనగాల అప్లాండ్ భట్టిప్రోలు నుంచి గూడవల్లి గంగోలు వరకు మూడు కిలోమీటర్ల పరిధి ఉన్నదని ఈ మురుగు కాలువ తూటి కాడ ,గుర్రపు డెక్క ఆకుతో పెన వేసుకుపోయి ఉన్నదని,దీని కారణంగా గతంలో వరి పొలాలు నీటి ముంపు గురయ్యాయని ఆయనకు తెలిపారు. ఈ మురుగు కాల్వ ఆయకట్టు మూడు వేల ఎకరాల మాగాణి భూమి నీటిముంపు గురికాకుండా ఎప్పటికప్పుడు మురుగు నీరు దిగువకు వెళ్ళిపోయే విధంగా తూటికాడను తొలగించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ ఎడ్ల జయశీలరావు,టిడిపి నాయకులు అంజిబాబు, డొక్కు శ్రీనివాసరావు, వంగర వీరయ్య,కంభం సుధీర్,వేల్పూరి వెంకట్రావు,కొన్నిపాటి లోకానంద్,ఇర్ఫాన్ బేగ్,కుంచె వెంకటేశ్వరరావు తదితరులున్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు టిడిపి శ్రేణులు తెలిపిన వివరాలను ఆలకించిన ఆయన రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులకు సూచిస్తామన్నారు.పార్టీ రూపొందించిన సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి తెలియపరచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.



## శాకాంబరి దేవిగా పోలేరమ్మ అమ్మవారు

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండలం సూరేపల్లి శివారు వేమవరం గ్రామములో కొలువై యున్న,భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుచున్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారు ఆదివారం శాకాంబరీ దేవతా రూపిణీ గా అవతారము దాల్చి సర్వ జనులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమాలను దేవస్థాన అర్చకులు దారా నారాయణమూర్తి పర్యవేక్షించారు.

## గ్రామదేవత పోలేరమ్మకు ఆషాఢం సారె



చెరుకుపల్లి, మేజర్ న్యూస్: గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఆదివారం టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు ఆధ్వర్యంలో పద్మశాలియ సంఘం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారుకు భక్తిశ్రద్ధలతో ఆషాడం సారీ సమర్పించారు. అలాగే చెరుకుపల్లి గౌడు పాలెం శ్రీరామ్ గౌడ్ ఆధ్వర్యంలో, కస్తూరి వారి పేట గౌడ్ యూత్ ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘం వారు, కొత్తపేట కాపు యూత్ ఆధ్వర్యంలో, ఎస్సి కాలనీ ఏకలవ్య యూత్ ఆధ్వర్యంలో డీజే తో ,డప్పులతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సారీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, అందే సాంబశివరావు, వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**13వ వార్డు ఎస్.ఎన్.పి అగ్రహారంలో...**



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా బాపట్ల పట్టణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. 13వ వార్డు ఎస్.ఎన్.పి.అగ్రహారంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న దుర్గ భవానీ మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాడ మాసం సారె సమర్పించుకున్నారు మహిళలందరూ అమ్మవారి ప్రతిమను నెత్తిన మోస్తూ, బాపట్ల పట్టణానికి అధిష్టాన దేవత అయిన గ్రామదేవత పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు. అక్కడ పోలేరమ్మ తల్లికి చీర,గాజులు,పసుపు కుంకాలతో పాటు పొంగలి, పులిహోరా, చలిమిడి వంటి అనేక రకాల నైవేద్యాలను పోలేరమ్మ తల్లికి సారెను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకాంబరీ దేవి అవతారంలో రకరకాల కూరగాయలతో అలంకరించబడి భక్తులకు కనుల పండుగ చేశారు. అనంతరం అమ్మవారికి భజనలు చేసి, అన్నదాన కార్యక్రమంలో భక్తులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను రెట్టింపు చేశాయి.

## జిల్లాలో ప్రథమస్థానం సాధించిన శ్రీమన్నారాయణ టీం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ విభాగంలో భట్టిప్రోలు ఏపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ టీం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదివారం గుంటూరు ఎన్టీఆర్ స్టేడియం లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మీట్ 50 ం మెన్స్ డబుల్స్ విభాగం లో గుడిమెట్ల శ్రీమన్నారాయణ-శీలం వినయకుమార్ జోడీ వర్సెస్ యస్ ఏ సింగారయ్య- ప్రత్తిపాడు సి ఐ శ్రీనివాస్ రావుల జోడీ పై ఫైనల్స్ లో గెలుపొంది జిల్లా లో ప్రథమస్థానం సాధించటం జరిగింది. ఈ సందర్భంగా భట్టిప్రోలు ఏపిఎంగా చేస్తున్న శ్రీమన్నారాయణను కార్యాలయ సిబ్బంది పలువురు అభినందించారు.

# సైన్స్ ద్వారానే సమాజం అభివృద్ధి



కనిగిరి, మేజర్‌న్యూస్: సైన్స్ ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ ఆఫీసులో జరిగిన ప్రాంతీయ మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మహాసభలకు అధ్యక్షులుగా షేక్ ఖాజా హుస్సేన్ వ్యవహరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వి.మాల కొండారెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 9, 10 తేదీల్లో గిద్దలూరులో జరిగే జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించేతత్వాన్ని, సృజనాత్మకతని పెంపొందించేందుకు గత 36 సంవత్సరాలుగా చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర లాగా మన అసెంబ్లీలో కూడా మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలని అన్నారు. ఈ మహాసభల్లో పిసిపల్లి, వెలిగండ్ల, హనుమంతుని పాడు, కనిగిరి మండలాలకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలని, కనిగిరిలో ఫ్లోరిన్ నీటి సమస్యను పరిష్కరించాలని, బడ్జెట్లో విద్యా రంగానికి, శాస్త్ర సాంకేతిక రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తిచేసి రైతుల ఆత్మహత్యలు నివారించాలని, మహిళలపై జరిగే అత్యాచారాలను అరికట్టాలని ఈ మహాసభలో తీర్మానాలు ప్రవేశ పెట్టారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు టి.పెద్దిరెడ్డి, టి.వెంకట్రాంరెడ్డి, మూలే బ్రహ్మారెడ్డి, జీ.రత్నయ్య, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, కె.గంగయ్య, షేక్ బషీరా, పిల్లి గిరిజ, జి.శ్రీనివాస రెడ్డి, షేక్ నాగూర్ బీ, కోటిరెడ్డి, షరీఫ్, ఆదిరెడ్డి, షాజహాన్,ఎం.బ్రహ్మయ్య, మహిబూన్, జైనాబీ, బి.నరసింహారావు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న ఖరీదైన ఫోన్ రికవరీ

వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని రావూరు రోడ్‌లో నీలం కుమారి అను మహిళ ఆటో ఎక్కి సంతరావూరు వెళ్తూ తన 55 వేల రూపాయలు ఖరీదు చేసే మొబైల్ ఫోను ఆటోలో మర్చిపోయినది. ఫోన్ మిస్సైన విషయం గుర్తుకు రావడంతో వెంటనే వేటపాలెం పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. వేటపాలెం ఎస్ఐ జనార్దన్ వెంటనే స్పందించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీ కెమెరాలు ఉపయోగించి సదరు ఆటో లొకేషన్‌ను కనిపెట్టడం తోపాటు రికవరీ చేసి ఫోన్ ని సదరు ఫిర్యాదికి ఇవ్వటం జరిగింది. దీనికి కారణం బాపట్ల జిల్లా ఎస్పీ ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్లనే ఈ ఫోన్ అతి త్వరగా కనిపెట్టడం జరిగిందని ఎస్సై తెలిపారు. పోయిన మొబైల్ తిరిగి అందించిన ఎస్ఐ జనార్ధన్‌కు మహిళ ధన్యవాదాలు తెలిపింది.

# దేవాంగ పురోహిత పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక



వేటపాలెం, మేజర్‌న్యూస్: ఆంధ్ర ప్రదేశ రాష్ట్ర దేవబ్రాహ్మణ (దేవాంగ) పండిత అర్చక పురోహిత పరిషత్ నూతన కార్యవర్గ ఎన్నిక వేటపాలెం మండలంలోని దేశాయిపేట పంచాయతీ అమోద గిరిపట్నంలోని సాయి బాబా కళ్యాణ మండపంలో ఆదివారం దేవాంగ పురోహిత పరిషత్ 4వ సర్వసభ్య సమావేశం రాష్ట్ర అధ్యక్షులు చల్లా రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మండప ప్రాంగణంలో దేవాంగ వంశీయుల కులదేవత శ్రీ రామలింగ చౌడేశ్వరీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా చల్లా రామారావు, ఉపాధ్యక్షులుగా కొలువుల మల్లిఖార్జునరావు, పన్నెం బాలశంకర్, అంబాబత్తుల అండకొండ రాముడు, ప్రధాన కార్యదర్శిగా చల్లా లక్ష్మనరావు, సహాయ కార్యదర్శిగా డా.కడి మల్లేశ్వర సిద్ధాంతి, దంతం శివ హనుమంతరావు, కోశాధికారిగా ఉట్ల మహదేవమూర్తి, ఉప కోశాధికారులుగా ఉట్ల ఏకాంబరం, గుంటు దుర్గాప్రసాద్, అధికార ప్రతినిధిగా బి.ఆనంద నాగప్రసాద్, యువజన విభాగం అధ్యక్షులుగా సజ్జా రాఘవ, సభ్యులుగా బందారు పరమేశ్వరయ్య, బొప్పన మోహన బాబు, బి.విఘ్నేష్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సర్వసభ్య సమావేశంలో శ్రీశైల గాయత్రి పీఠం పునరుద్ధరణ, వేద ఆగమన జ్యోతిష్య పాఠశాల ఏర్పాటు, పురోహితులకు శిక్షణ తరగతులు నిర్వహణ, జిల్లా కమిటీల ఏర్పాటు, సనాతన ధర్మ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించి కృషి చేసేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని దేవాంగ అర్చక పురోహితులు, జ్యోతిష్యులు, సిద్ధాంతులు పాల్గొన్నారు.

## మతిస్థిమితంలేక తప్పిపోయిన వ్యక్తి



నగరం, మేజర్‌న్యూస్: చీరాల పట్టణానికి చెందిన అన్నపురెడ్డి గోపి (45) మతిస్థిమితంలేని కారణంగా తప్పిపోయినట్లు స్థానిక ఎస్ఐ భార్గవ్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు గోపి మతిస్థిమితంలేని కారణంగా తిరుగుతూ ఉంటాడు. చీరాల పట్టణానికి చెందిన ఆంజనేయులుతో కలిసి అప్పుడప్పుడు లైటింగ్ పని చేస్తూ ఉంటాడు. 2024వ సంవత్సరం నవంబరు 10వ తేదీన ఆంజనేయులుతో కలిసి స్థానిక మండల పరిధిలోని మంత్రిపాలెం శివారు బొడ్డువారిపాలెం వచ్చాడు. రెండు రోజుల తర్వాత అనగా 12వ తేదీ నుంచి నా కుమారుడు గోపి కనిపించటంలేదంటూ అతని తల్లి అన్నపురెడ్డి సరోజిని చీరాల వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసి కేసు దర్యాప్తు నిమిత్తం స్థానిక పోలీసు స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెం.62/2025తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తప్పిపోయిన గోపి ఆచూకి తెలిసినవారు ఫోన్ నెంబరు 9440900877 ద్వారా తెలియజేయాలని భార్గవ్ కోరారు.

## మార్కెట్ మటన్ షాపుల్లో తనిఖీలు



వేటపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం తూనికలు కొలతల ఇన్స్పెక్టర్ కరేటి నాగేశ్వరరావు చికెన్ మటన్ దుకాణాల తనిఖీ నిమిత్తమై వచ్చారు. బిస్మిల్లా మటన్ షాపు మొదలు పలు దుకాణాల తూనికలలో లోపాలు ఉన్నట్టు గమనించి సదరు వేయింగ్ మిషన్లను సీజ్ చేయడంతో పాటు సుమారు ఏడు షాపులై కేసు రాయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు ఆదివారం వేటపాలెంలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని, కొన్ని మటన్ దుకాణాలలో కేజీకి సుమారు 50 నుండి 100 గ్రాములు తక్కువగా ఉండడం గమనించి సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలను దుకాణ దారులు లాభాపేక్షతో మోసాగిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# భక్తిశ్రద్ధలతో పందిళ్లమ్మ అమ్మవారి సంబరాలు



పొంగళ్ళు మొక్కులు చెల్లించుకునే భక్తులకు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూన్నానని, ఆ

వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని పందిళ్ళపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పందిళ్ళమ్మ అమ్మవారి పొంగళ్ల గ్రామ ప్రజల సహకారంతో ఆలయ కమిటీ ఘనంగా ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య రావడం జరిగింది. ఆలయ కమిటీ పెద్దలు స్థానిక నాయకులు సాదరంగా కొండయ్యను ఆహ్వానించి ప్రత్యేక పూజ చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పందిళ్ళపల్లి గ్రామ దేవత అయిన శ్రీ పందిళ్ళమ్మ సంబరాలు ఘనంగా చేసుకొని పొంగళ్ళు మొక్కులు చెల్లించుకునే భక్తులకు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూన్నానని, ఆ అమ్మవారు అందరిని అందరినీ కూడా చల్లగా చూడాలని అమ్మవారిని కోరుకుంటూ, నా వంతు కృషిలో భాగంగా పందిళ్ళపల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కోలా రామయ్య, రెండా సత్యనారాయణ రెడ్డి, తిరుమల శ్రీనివాసరావు, తిరుమల సాంబయ్య, ఆనాల నరసింహారావు, స్థానిక నాయకులు పల్లపోలు శ్రీనివాసరావు, నాచక వీరభద్రయ్య, పోలకం చంద్రశేఖర్, పెరిసెట్ల బాలచంద్ర, నాచక మల్లేశ్వరరావు, గుత్తి లింగమూర్తి, నరహరి శివయ్య, కడెం జయశంకర్, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 24న సెక్యులర్ భారత రాజ్యాంగం

### లాల్, నీల్ మైత్రి ఆవశ్యకతపై సదస్సు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఈనెల 24వ తేదీన ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సెక్యులర్ భారత రాజ్యాంగం – లాల్, నీల్ మైత్రి ఆవశ్యకత అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని స్థానిక సివిఎన్ రీడింగ్‌రూమ్ ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో లాల్, నీల్ శక్తులు గణనీయ పాత్ర వహించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామన్నారు. ఈ సదస్సుకు వామపక్షవాదులు, అంబేద్కర్ వాదులు, అభ్యుదయవాదులు, ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, సంత వేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లికార్జునరావు, అంగలకుర్తి ప్రసాద్, కొమ్మినేని హరీష్ చక్రవర్తి, మల్లికార్జున రావు, భీమవరపు సుబ్బారావు, ఎం.సుబ్బారావు, సత్యనారాయణ, డి.సింగయ్య, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం




సంతమాగులూరు మేజర్‌న్యూస్: సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం నాడు చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గంధపాలకులు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని విద్యార్థులచే పుస్తక పఠనం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 22 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

# 'ఆకుపాటి' న్యాయం చేశారు

**చిన్నపాప చేతిలో జారిన లక్ష విలువైన బంగారు గొలుసు**

**సీసీ కెమెరా ఆధారంగా గుర్తించి గొలుసు తిరిగి బాధితుడికి అప్పగింత**



పామూరు, మేజర్‌న్యూస్: పట్టణానికి పవిత్రతను తెచ్చేలా ప్రజలకు ఆశావహ నేతగా నిలుస్తున్న టిడిపి యువ నాయకుడు, పట్టణ రెండవ ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ మళ్లీ మరోసారి తన ప్రజానురాగాన్ని చాటుకున్నారు. కేవలం ఓ పదవిగా కాకుండా బాధిత గుండె ధ్వనిగా స్పందించి న్యాయం నిలబెట్టిన ఈ నాయకుడి తీరు ఇప్పుడు పామూరులో ప్రశంసల పల్లకిలో ఊరేగుతోంది. పట్టణంలోని ఎన్జీఓ కాలనీ ఒకటో లైన్‌లో నివసిస్తున్న షేక్ సంసూర్ కుమార్తె చిన్నపాప చేతిలో ఉన్న బంగారు గొలుసు (సుమారు లక్ష రూపాయల విలువైనది) రోడ్డుపై జారి పోయింది. గొలుసు మాయం అయిన విషయాన్ని గమనించిన వెంటనే కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. బాధితులు వెంటనే ఆకుపాటి వెంకటేష్ పట్టణ రెండవ ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్‌ను ఆశ్రయించారు. ఆయన విషయాన్ని తెలిసిన వెంటనే బాధను తనదిగా భావించి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో బంగారు గొలుసును తీసుకెళ్తున్న యువకులను గుర్తించి వారిని పిలిపించి వారి సహకారంతో గొలుసును తిరిగి బాధిత కుటుంబానికి అప్పగించారు. బాధితుడు షేక్ సంసూర్ మాట్లాడుతూ ఆకుపాటి వెంకటేష్ లేకపోతే మా గొలుసును తిరిగి చూసేవారు కాదు. మాకు న్యాయం చేసిన ఆకుపాటి నిజమైన నాయకుడు అంటూ ఎమోషనల్ అయ్యారు. సంసూర్ కుటుంబ సభ్యులు ఆకుపాటి వెంకటేష్‌ను అభినందించారు.

# మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన




చీమకుర్తి, మేజర్‌న్యూస్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఐదో రోజుసమ్మె కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి నిరసిస్తూ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పాటిబండ్ల పద్మ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల గత సమ్మె కాలపు ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలని, కార్మికులందరికీ సంక్షేమ పథకాల అమలు చేయాలని, జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీ అమలు చేయాలని, దహన సంస్కారాలకు 20వేలు రూపాయలు పెంచాలని, వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పాలేటి ఏడుకొండలు, నాయకులు ఇట్టా నాగయ్య,పిచ్చయ్య, వేమా శ్రీను, నర్సయ్య, ఆంధ్రీ, విజయ, చెన్నమ్మ,అరుణ తదితరులు పాల్గొన్నారు

## సేవా సంకల్ప ట్రస్ట్ 56వ వారం పేదలకు అన్నదానం



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని సంతనూతలపాడులో ఆదివారం సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 56వ వారం పేద వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహించారు. సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై, పోతూరు సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో గత 56 వారాల నుండి దేశ విదేశాల నుండి దాతల సహకారంతో అన్నదాన వేడుకలను, మెడికల్ క్యాంపులను, విద్యా ప్రోత్సాహక, తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వర్గాలకు దాతలు సహకారంతో ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణ స్వామి చౌదరి, ట్రస్ట్ సభ్యులు శీలం మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు, ఆర్.జార్జి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ అమ్మవారికి విశేషాలంకరణ



దర్శి, మేజర్‌న్యూస్: శ్రీలక్ష్మీ అమ్మవారికి వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరింపజేశారు. శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారికి వివిధ రకాల పూలతో భక్తులు అలంకరింపజేశారు. దేవస్థాన ప్రాంగణమంతా వివిధ రకాల పూలతో అలంకరించారు. దరిశికి చెందిన అమ్మవారి భక్తుడు కట్టె కోటహరీష్ ప్రతి ఆదివారం అమ్మవారికి వివిధ రకాల పాలతో శోభాయమానంగా అలంకరింప చేస్తుంటాడు. ఇటీవల 75 వేల రూపాయల వ్యయంతో శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు.

## మండలంలో జడివానతో రైతులు హర్షం

### ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులు

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: మండలంలో ఆదివారం కురిసిన జడివానకు భూములు పదును కృతంతో మండల రైతాంగమంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షం కోసం ఎదురుచూసిన రైతన్నకి ఈ వర్షం వలన ఇటీవల నాటినమొక్కజొన్న జీవం పోసుకుంది. మెట్ట ప్రాంతాల రైతులందరూ కంది సాగుకు అనుకూలంగా సేద్యంకు సిద్ధమవుతున్నారు. కొందర్రైతే ఇప్పటికే వ్యవసాయ విద్యుత్తు మోటార్ల బోరు బావుల కింద వరి నార్లు పోసుకున్నారు. సకాలంలో వరినారులు పోసుకుంటే పంట దిగుబడి కూడా నాణ్యత కలిగిన విత్తనాలతో వరి ధాన్యం దిగుబడి అవుతుందని ఆశాభావంతో ముందుగా నంద్యాల. కర్నూలు ప్రాంతాల నుండి బిపిటి సోనారకం విత్తనాలు కొనుగోలు చేసి నార్లు పోసుకున్నారు. ముఖ్యంగా బోరు బావుల కింద నార్లు పోసుకుంటే సాగర్ నీరు విడుదలైన వెంటనే వరి నాట్లు వేసుకొని కనీసం తిండి గింజలకైనా పండించుకునే అవకాశం ఉంటుందని ఆశాభావంతో రైతాంగం అంతా సాగర్ నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం అంతా పంటలు ఓమాదిరిగా పండినప్పటికీ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో నష్టాల్లో ఉన్నప్పటికీ తిండి గింజల కోసం అయినా వరిసాగు చేయక తప్పలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు సబ్సిడీపై కందులు, పెసలు, మినుములు, వరి వంగడాలు సబ్సిడీపై అందజేస్తే ప్రభుత్వం కొంతమేరకైనా రైతులను ఆదుకున్నట్లు అవుతుందని మండల రైతులు ప్రభుత్వానికి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నేడు రొయ్యల రైతులు ధర్నా

ఒంగోలు, మేజర్‌న్యూస్:ప్రకాశం జిల్లాలో రొయ్యల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే క్రమంలో భాగంగా జులై 21వ తేదీ సోమవారం ఉదయం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్యల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఈదర యశ్వంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ 1.50 విద్యుత్ ధరను ఆక్వానాన్, ఆక్వా జోన్ అనే తేడా లేకుండా అన్ని చెరువులకు వర్తింపచేయాలని, 2019 ముందు ఇచ్చిన ఉచిత ట్రాన్స్ఫార్మర్లను రొయ్యల రైతులకు అందించాలని, కరోనా తర్వాత పెరిగిన ఆక్వా కెమికల్స్ ధరలను తగ్గించాలనే తదితర డిమాండ్లతో శాంతియుత ధర్నాను చేపడుతున్నట్లు తెలిపారు, జిల్లాలోని రొయ్యల రైతులందరూ ఈ శాంతియుత ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఈదర యశ్వంత్ కుమార్ పిలుపునిచ్చారు.

సూర్య www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల




## వేలిముద్రలతో రంగుల వృక్షం

కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం హైవెండు హైస్కూల్‌లో రంగుల దినోత్సవం సందర్భంగా చిన్నారులు హైవెన్డ్ హైస్కూల్ గదులను రంగు రంగులతో అలంకరణ చేశారు. ఉపాధ్యాయుల సూచనలతో చేతి బొటని వేలితో వేలి ముద్రలు వేస్తూ రంగుల వృక్షంను తీర్చిదిద్దారు. రంగుల వృక్షం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల ను ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పెదమల్లు ఉదయ్ చందర్రావు మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్ర బాబు డైరెక్టర్ చాందిని ఉపాధ్యాయులు ఫరీదా, రజియా, అనూష, బ్యూలా, జరీనా,వినీత షబీనా,ద్వారక, రమణ తదితర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తుములను కలసిన ముస్లిం మైనార్టీ నాయకులు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని గిద్దలూరు ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం కమిటీ, నియోజకవర్గంలోని అన్ని మసీదుల అధ్యక్షులు కలిసి గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుమల అశోక్ రెడ్డిని కలిసి మసీదులలో పనిచేసే ఇమామ్ మౌజన్ల వేతనాలు గత 9 నుండి రాలేదని దానివల్ల మసీదుల కమిటీల వారు ఇబ్బందులకు గురవుతున్నారని అలాగే కొత్తగా ఇమామ్ మౌజనుల వేతనాల కొరకు దరఖాస్తులు చేసుకుని దాదాపు 8 సంవత్సరాలు కావస్తున్నదని ఆ మసీదులకు ఇంతవరకు వేతనాలు మంజూరు చేయలేదని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేతనాలను మంజూరు చేయించాలని గిద్దలూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుడిసె మహబూబ్ బాషా వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రఫీ, షబ్బీర్, ఖాసీం, మహబూఖాన్, దాదా పీర్, ఇబ్రహీం, గఫార్, గోల్కొండ, చాంద్ బాషా, నూరుల్లా నాగూర్, దస్తగిరి పేరయ్య మోదిన్, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల మసీదు పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా పేరలమ్మకు ఆషాఢం సారె




కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండలం పేరలి గ్రామాల లోని గ్రామ దేవత పేరలమ్మ తల్లికి ఆషాఢమాసం సందర్భంగా గౌడ పాలెం మహిళలు అమ్మవారికి సారె, పసుపుకుంకుమలు సమర్పి ంచారు. గ్రామాలలోని మహిళలు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో సంబరాలు చేస్తూ ఆలయం వద్ద చేరుకొన్నారు. ఆలయ ప్రదక్షిణలు చేసి సారె పసుపుకుంకుమలు సమర్పించి పూజలు చేశారు. గ్రామాలలోని ప్రజలందరు బాగుండాలని ,పాడిపంటలతో రైతులు బాగుండాలని అమ్మవారిని కోరుకొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాటూరి బైరాగి, కర్రి శివయ్య,బోలగాని వెంకటేశ్వర్లు,కర్రి ఉమామహేశ్వర రావు, లుక్కా శివయ్య,కాటూరి ప్రసాద్,ఏమినేని శ్రీనివాసరావు, కాటూరి శ్రీదేవి,లక్ష్మీ,మమత పాల్గొన్నారు.

# నారకొండలో భక్తుల కోలాహలం

- వైభవంగా ధ్యాననారాయణస్వామి ఆరాధన
- జిలకర నారాయణ భోజన వితరణ





సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో నారకొండలో వెలసిన ప్రసిద్ధిగాంచిన మహిమాన్విత పుణ్యక్షేత్రం నారకొండ ధ్యాననారాయణస్వామి దేవస్థానంలో ఆరాధన ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం పూజలు నిర్వహించి అనంతరం స్వామివారిని ఇతర దేవతామూర్తులను పట్టు వస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేసి పూజలను దేవస్థానం నిర్వాహకులు పాశంపెద్దక్క ఆధ్వర్యంలో అర్చకులు రోశిరెడ్డి, తిరుపాలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఆవరణలో వివిధ హెూమపూజలు నిర్వహించి మేళతాళాలు భక్తుల నారా యణ గోవింద నామస్మరణతో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం సమీపంలో నాగేంద్రస్వామి పుట్టవద్దకు వెళ్లి పుట్టకు ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు. నారాయణ స్వామి ఆరాధన మహెూత్సవం సందర్భంగా సుమారు 5వేల మంది భక్తులకు మండలంలోని అయ్యలూరివారిపల్లె పంచాయతీ జినుగువారిపల్లె గ్రామస్థులు బెంగుళూరులో స్థిరపడిన జిలకరనారాయణ పద్మావతి దంపతులు కుటుంబసభ్యులు భక్తులకు భోజనవితరణ చేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులు చిన్నారులచే భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నారకొండ నారాయణస్వామి ఆరాధన మహెూత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని అన్నిమండలాలు అదేవిధంగా సమీపజిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో నారకొండ పరిసరాలు భక్తజనసందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు రోశిరెడ్డి, నిర్వాహకులు పాశం పెద్దక్క, తిరుపాలు(బెంగుళూరు), తోట రామయ్య, పులిరామిరెడ్డి, స్వామివారి రవాణా వాహన దాతలు విశ్రాంత టీచర్ యనమల నరసయ్య, నల్లబోతుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, భోజనదాత జిలకర నారాయణ కుటుంబ సభ్యులు, స్వామివారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## వల్లూరమ్మను దర్శించుకున్న దామచర్ల కుటుంబ సభ్యులు




టంగుటూరు, మేజర్‌న్యూస్: మండలంలోని వల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లూరమ్మ తల్లి అమ్మవారిని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తండ్రి పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులు ఆదివారం వల్లూరు అమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వల్లూరమ్మ దేవస్థానం నందు శ్రీ విస్వావసు నామ సంవత్సర ఆషాడ మాసం సందర్భంగా వల్లూరమ్మా వారు వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరణ శోభితముగా శాఖాం బరి దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ కుటుంబ సభ్యులతో పాటు, దామచర్ల పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జిల్లాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వల్లూరు అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులైనారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఏర్పాట్లను చేశారు.

## ఫలించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృషి



దర్శి, మేజర్‌న్యూస్: పొదిలి నుండి దర్శి మీదగా గుంటూరు విజయవాడ బస్సులు ఉండి పోయేందుకు దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేసిన కృషి ఫలించింది. దర్శి ప్రాంతం నుండి గుంటూరు, విజయవాడ నగరాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ప్రయాణం ఇక సులభతరమైంది. పొదిలి నుండి గుంటూరు వరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ లక్ష్మి సంబంధిత రవాణా శాఖ మాత్యులు రాంప్రసాద్ రెడ్డి ని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుండి పొదిలి నుండి వయా దర్శి మీదుగా ఆర్టీసీ ఎక్స్ప్రెస్ బస్సులు తిరుగుతాయి అని ఆర్టీసీ అధికారులు తెలిపారు. పొదిలి నుండి గుంటూరుకు ఉదయం 5గంటలకు, 6.30 నిమిషాలకు 8 గంటలకు, 10 గంటలకు, మధ్యాహ్నం 12.30 గంటలకు, 2 గంటలకు, 3.30 గంటలకు సాయంత్రం 6.30 గంటలకు, గుంటూరు నుండి పొదిలికి ఉదయం5 గంటలకు, 8.45 నిమిషా లకు, 10.15 గంటలకు, 11.45 గంటలకు, మధ్యాహ్నం 1.45 గంట లకు, 4.15 గంటలకు సాయంత్రం, 5.45 గంటలకు, 8.15 గంటలకు గుంటూరు, విజయవాడ ప్రధాన నగరాలకు దర్శి పట్టణం నుండి ఆర్టీసీ బస్సులను ఏర్పా టు చేయడంపై దర్శి ప్రాంత ప్రజలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూఅభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలకమైనదని దర్శి నుండి ప్రధాన నగరాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజల నుండి వస్తున్న వినతుల ఆధారంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు సంబంధిత రవాణా శాఖ మంత్రికి ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ అధికారులకు కూడా అభినందనలు తెలిపారు.

## నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌కు విద్యార్థులను సమయత్వం చేయాలి

దర్శి, మేజర్‌న్యూస్: ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ వచ్చే విద్యా సంవత్సరానికి నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాయాల్సిందిగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఎంఈఓలు కె.రఘురామయ్య, రమాదేవి సంయుక్త ప్రకటనలో కోరారు. మీ పాఠశాలల్లోని అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ఈ పరీక్షకు దరఖాస్తు చేయాలని, అందరూ పరీక్ష రాసేలా వారి దరఖాస్తులు పూర్తి చేసి ఆన్లైన్, అఫ్ లైన్‌లో అప్లై చేయాలని కోరారు. అప్లికేషన్ లాస్ట్ డేట్ 29 అని ఎంఈఓ తెలిపారు.




## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


వేమూరు(భట్టిప్రోలు)మేజర్ న్యూస్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చంపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు. ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణ కుమారి,టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్,గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, తాతాజీ,తేజ ప్రసాద్,పికరాజు,చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, వేల్పుల రవి ప్రసాద్,జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## తిరునాళ్ల మహెూత్సవంలో నాగార్జునరెడ్డి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఈశ్వర విగ్రహా ప్రతిష్ట, అంకాలమ్మ గ్రామ దేవతల ప్రతిష్ట అనంతరం 40 రోజుల తిరునాళ్ల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కేపీ నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వైసీపీ పార్టీ కార్యకర్తలు కేపీ నాగార్జున రెడ్డికి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. వారి వెంట పలువురు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



# చదువుకు సాయం అభినందనీయం: ఎమ్మెల్యే



చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాల కిరాణా మర్చంట్స్ కళ్యాణమండపంలో అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన చదువుల పండుగ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 109మంది విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలు, 80 మంది విద్యార్థులకు వడ్డీలేని విద్యారుణాలు, 64 మంది విద్యార్థులకు ఉచిత చేయూత పురస్కారాలు, 40 మందికి వడ్డీలేని ఉపాధి రుణాలు, వీటితోపాటు వడ్డీలేని రుణంగా ఐదుగురు విద్యార్థులకు ల్యాప్టాప్ కంప్యూటర్లును ఎమ్మెల్యే మాలకొండయ్య చేతుల మీదగా అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ చదువుకు ప్రోత్సాహంగా చీరాల అవోపా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. దాతల అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా చదవాలని ఆకాంక్షించారు. మొత్తం 250 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు దాదాపు 25 లక్షల రూపాయల విలువైన సహాయాన్ని అందించి గొప్ప మనసు చాటుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తమాసు శివ రంగనాయకులు, మువ్వల వెంకట రమణారావు, బొలిశెట్టి మురళీకృష్ణ, బొలిశెట్టి రమేష్ కుమార్, పోలిశెట్టి ప్రేమ్ కుమార్, ఆవోపా వలివేటి మురళీకృష్ణ, ప్రెసిడెంట్ పోలిశెట్టి శ్యామసుందరరావు, సెక్రటరీ పేర్ల వెంకటరామయ్య, ట్రెజరర్, విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వానికి బాసటగా నిలుద్దాం

### – బీజేపీ నేత డాక్టర్ ఏలూరి –



మార్కాపురం, మేజర్‌న్యూస్:స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించా లంటే ప్లాస్టిక్ నిషేధం అత్యవసరమని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ప్లాస్టిక్ వాడకం విషయలో ప్రజలు మేల్కొనాలి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకంతో వాతావరణం తీవ్రంగా కలుషి తమవుతోందని, గృహాలు, కాలనీలు, డ్రైనేజీ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతోం దని ఆయన తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ పదార్థాలు మాత్రమే కాకుండా, ఒకసారి వాడేసి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని కూడా పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని డాక్టర్ ఏలూరి సూచించారు. ప్లాస్టిక్ నిషేధం ఒక్క ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రతి ఒక్క పౌరుని ధర్మం. మన భవిష్యత్తు తరాల కోసం, నేడు ప్లాస్టిక్‌కు గుడ్ బై చెప్పాలి అని డాక్టర్ ఏలూరి పేర్కొన్నారు.

## ఊపిరి పోసిన వర్షం

ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలో ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి వర్షం కురుస్తుంది. రాత్రి 8:30 గంటల వరకు వర్షం కొనసాగుతూనే ఉంది. సుమారు ఒక దుక్కి వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల మండలంలో అనేక పంటలకు ప్రయోజనం చేకూరింది. ప్రత్యేకించి పునాస మామిడి తోటలకు వర్షం మేలు చేకూర్చింది. ఆగస్టు–జనవరి మధ్య పంట దిగుబడి ఇచ్చే పునాస మామిడి తోటలు ఇప్పుడు పూత పిందె దశలో ఉన్నాయి. వర్షం వల్ల పూత దశలో ఉన్న పునాస మామిడి తోటలకు కొంత నష్టం జరిగి నప్పటికీ అత్యధిక తోటలకు ప్రయోజనం చేకూరింది. నెల రోజులుగా కొనసాగుతున్న వర్షాభావం వల్ల సాగునీటి వసతిలేని పునాసమామిడి తోటలు విలవిలలాడుతు న్నాయి. ఇప్పటి వర్షంతో పునాసమామిడి తోటలకు ఊరట కలిగింది. అలాగే సాధారణ మామిడి తోటలకు కూడా వర్షం మేలు చేకూర్చింది. దాదాపు నెల రోజుల క్రితమే పంట దిగుబడి కోతలు పూర్తి కావడంతో నేలలో తేమ లేక పోవడంతో సాధారణ మామిడి తోటలు నిర్జీవంగా ఉన్నాయి. ఇప్పటి వర్షంతో సాధారణ మామిడి తోటలు తిరిగి కళకళలాడే అవకాశం ఉంది.అంతేకాక ఈ వర్షం వల్ల సాధారణ మామిడి తోటల్లో రైతులు కొమ్మ కొట్టు దున్నటం వంటి సేద్యపు పనులు ప్రారంభించే అవకాశం ఉంది. మండలంలోని సపోటా తోటలు, జామాయిల్, సర్వీతోటలకు కూడా ఈవర్షం ప్రయోజనం చేకూర్చింది.

## నేడు దర్శిలో గొట్టిపాటి లక్ష్మీ పర్యటన



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలో నియోజక వర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పర్య పంచనున్నారని మండల టిడిపి అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీసుపరిపాలన తొలి అడుగు – ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా దర్శి మండలం, తూర్పు వీరయపాలెం గ్రామంలో పాల్గొంటా రని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇంచార్జలు, వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని వెంకటేశ్వర్లు కోరారు.

## నేడు 'బుద్ధునితో నా ప్రయాణం డాక్టర్ బిఆర్ అంబేద్కర్' నాటక ప్రదర్శన



ఒంగోలు, మేజర్‌న్యూస్: నేడు నగరంలోని అంబేద్కర్ భవన్ వద్ద బుద్దునితో నా ప్రయాణం అనే నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఈ. మహేష్ నాగ తెలియజేశారు. సాయంత్రం 6 గంటలకు జరిగే నాటక ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులేనని, నాటికను వీక్షించేందుకు కుటుంబ సమేతంగా తరలిరావాలని ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు వై. హరిబాబు పిలుపుమేరకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి బుద్ధునితో నా ప్రయాణం – డా. బి.ఆర్ అంబేద్కర్ అను తెలుగు నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ నాటక ప్రదర్శనను తిలకించి తథాగత గౌతమ బుద్ధుని ధమ్మ మార్గం గురించి తెలుసుకుని, మన తోటి వారికి తెలియజేసి, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రబుద్ధ భారతాన్ని నిర్మింపజేసి, ప్రపంచానికి భారత దేశం విశిష్టత తెలియ చేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మండల, గ్రామ స్థాయిలలో ఉన్న ఔత్సాహికులు, బౌద్ధులు, అంబేద్కరీయులు, ఉద్యోగులు, బహుజన మేధావులు, విద్యార్థినీ విద్యార్థులు కుటుంబ సమేతంగా వచ్చి, ఈ నాటక ప్రదర్శనను తిలకించాల్సిందిగా మహేష్ నాగ కోరారు.

## జగన్మాత ఈశ్వరిదేవికి ఆషాఢ సారె సమర్పణ



పంగులూరు, మేజర్‌న్యూస్: పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో ఆదివారం బొల్లాపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారికి ఆషాడ మాసంలో సారె సమర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని విశ్వ బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. ఈశ్వరి మాతకు కుంకుమ పూజ, పలు ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ పెద్దల సమక్షంలో ఇకనుండి ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో సంఘం తరుపున శ్రీ ఈశ్వరి మాతకు సారె సమర్పించాలని, భవిష్యత్తులో కూడా వచ్చే కార్యవర్గాలు ఈ ఆనవాయితీని కొనసాగించాలని తీర్మానించారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ చీరలతో సారె సమర్పించి పూజలు చేశారు. అనంతరం అందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు టి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళ పాటి నాగేంద్రప్రసాద్, సంఘీయులు మచ్చా హనుమాచారి, కోల్లపూడి రమేష్ బాబు, రావూరి దిలీప్, మేడూరి నాగేశ్వరరావు, మేడూరి శ్రీహర్ష, బొగ్గవరపు శ్రీనివాసులు తక్కెళ్ళపాటి వరప్రసాద్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం: ఎమ్మెల్యే ఉగ్ర



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: కనిగిరి నియోజకవర్గంలో ప్రజల అంచనాలకు తగ్గ ప్రభుత్వ పరిపాలనకు నాంది పలికేలా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం కొనసాగుతోంది. హనుమంతునిపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయతీలో ఆదివారం టీడీపీ శ్రేణుల చైతన్యంతో మార్మోగింది. టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అధ్యక్షతన కనిగిరి శాసనసభ్యులు డైనమిక్ లీడర్ డాక్టర్ నరసింహారెడ్డి, కార్యకర్తలు కలసి ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శ్రేణులంతా కలసి పటిష్టంగా ప్రచారాన్ని కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రజలతో చర్చలు జరిపారు. ప్రతి కుటుంబంలో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు సాగుతుందని తెలియజేశారు. గెలిచిన సంవత్సరం రోజులలో బైపాస్ రోడ్డు మోడల్ స్కూల్‌కు రోడ్డు ఇంటిరిగేట్ హాస్టల్లో అభివృద్ధి కంపోస్ట్ బయోగ్యాస్ కంపెనీ రైల్వే లైన్లు పనులు వేగంగా జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ట్రిబుల్ ఐటీ వెలుగొండ ప్రాజెక్టు ఇంటింటికి కొలాయి సిసి రోడ్లు వేసేందుకు ప్రత్యేకమైన కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మురహరి నరసయ్య, గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కుందూరు నారాయణరెడ్డి, సుమిత్ర తిరుపతిరెడ్డి, దేవిరెడ్డి రాజారామిరెడ్డి, గ్నాయం కృష్ణారెడ్డి, సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, సర్పంచి కూడలి అరుణా దశరథ, గంగిరెడ్డి రమేష్ రెడ్డి, కత్తి తిరపాలు, కూడలి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అభివృద్ధి చరిత్ర ఇంటింటికి చెబుతాం: హాజీ గౌస్

పామూరు, మేజర్‌న్యూస్: నవ్యాంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి చరిత్రను ప్రతి ఇంటికీ తీసుకెళ్లే బాధ్యత మాకుంది అని టిడిపి నాయకుడు ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ హాజీ గౌస్ పేర్కొన్నారు. కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి పిలుపు మేరకు పామూరు మండల టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆదేశాలతో పామూరు పట్టణంలోని 266వ బూత్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జి ఖాదర్ బాషా, పలువురు పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## చీమకుర్తిలో భారీ వర్షం

### ఖరీఫ్ సేద్యానికి మేలు చేస్తున్న వర్షం

చీమకుర్తి, మేజర్‌న్యూస్: చీమకుర్తి ప్రాంతంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వలన రైతులకు ఆనందం.పంటలకు ఈ వర్షం పంటలకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో భారీగా సాగు చేసిన సరుగుడు, ఇతర పంటలకు వర్షం ప్రాణం గా భవిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసినకూరగాయల తోటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీనారాయణస్వామి దేవస్థానంలో పూజలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం నందు ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారి అభిషేక విగ్రహానికి పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్టు ఇతర దేవతామూర్తులను పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేసి పూజలను దేవస్థానం ప్రధాన అర్చకులు యం.ప్రసాదుశర్మ నిర్వహించగా పూజా కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహాబాబు కుటుంబ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం ఆవరణలో గోమాతను పూజించి గోపూజా కార్యక్రమం తదుపరి దేవస్థానం అధ్వర్యంలో స్వామివారికి భక్తులతో కలిపి మహానైవేద్యం సమర్పించి పూజలు చేసి హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు భోజనవితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ శ్రీగిరిరాజు నరసింహబాబు కుటుంబ సభ్యులు, స్థానికులు, భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికం ప్రతిభకు అడ్డు కాకూడదు : వినుకొండ రాజారావు

### విద్యార్థిని పూజితకు నగదు ప్రోత్సాహం




ఒంగోలు, మేజర్‌న్యూస్: పేద విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజ రుణం తీర్చుకున్న వార మౌతామని గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు తెలియజేశారు. పేద విద్యార్థిని బుల్లా పూజితకు నగదు ప్రోత్సాహం అందించారు. ప్రముఖ హోటల్ రంగ నిపుణుడు, సెలబ్రేషన్స్ హెటల్ అధినేత బుల్లా సుధీర్ మాట్లాడుతూ పేదరికం ప్రతిభకు అడ్డు కాకూడదని, మెరుగైన ప్రతిభ కనబరుస్తున్న పూజిత లాంటి విద్యార్థులను ప్రోత్సహించటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనిగండ్ల మాజీ సర్పంచ్ గురవయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మోజెస్, చుక్కారావు, ప్రముఖ న్యాయవాది బియం యస్ కుమార్ పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు, సరోజాదేవీలకు ఘన నివాళి



ఒంగోలు, మేజర్‌న్యూస్:శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో ఇటీవల దివంగతులైన ప్రముఖ సినీ నటులు కోట శ్రీనివాసరావు బి. సరోజా దేవిల సంస్మరణ సభా కార్యక్రమం నిర్వహించారు. తొలుత కోట, సరోజాదేవి చిత్రపటాలకు పలువురు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మిడసల మల్లికార్జున రావు మాట్లాడుతూ దక్షిణ భారత చలన చిత్ర రంగంలో తమదైన శైలిలో రాణించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలతో పాటుగా సినీ ప్రేక్షకుల హృదయాలలో ఎన్నటికీ చెరగని స్థానం పొందిన వీరు ఇరువురు ధన్యులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరావు, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, విశ్రాంత అటవీ శాఖ అధికారి గుంటూరు సత్యనారాయణ, పొదిలి బాల గురవయ్య , వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాస్ హాస్పిటల్స్ వైద్యశిబిరానికి విశేష స్పందన



పంగులూరు, మేజర్‌న్యూస్: పంగులూరు మండల విశ్వ బ్రాహ్మణ నూతన సంఘం వారి ఆధ్వర్యంలో, ఒంగోలు ఉపాస్ హాస్పిటల్స్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మండల కేంద్రం పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పంగులూరు మరియు పరిసర గ్రామాల నుండి 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యశిబిరం సమన్వయకర్త తాళ్ళూరి రామాంజనేయులు తెలిపారు.ఈ మెగా వైద్యశిబిరంలో డా.జగదీశ్ బాబు , డా.జి .శ్రీనివాస్ , డా.వి.జయవర్ధన్ మరియు కంటి వైద్యులు పాల్గొని రోగులకు అవసరమైన సాధారణ పరీక్షలు నిర్వహించి వారికి ఒక వారం రోజులకు సరిపడా ఉచిత మందులను అందజేసారు . 22 మందిని మెరుగైన వైద్య పరీక్షల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా ఒంగోలులోని ఉపాస్ హాస్పిటల్స్ కు సిఫార్స్ చేసారు . ఈ వైద్యశిబిరంలో ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనంద్, హాస్పిటల్స్ పి.ఆర్ ఓ ఇస్లాం హాస్పిటల్ సిబ్బంది, సింగరకొండ సత్రం అధ్యక్షులు దంతనాల కనకరత్న చారి, నూతన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి సాంబశివరావు ,నియోజకవర్గ యువ నాయకులు కోళ్లపూడి సురేష్ బాబు, జె.పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్రాచారి, ఉపాధ్యక్షులు కందుకూరి మల్లిఖార్జున్, మేడూరి శివరాం ప్రసాద్, మాజీ జెడ్పిటిసి కర్రీ వెంకట సుబ్బారావు,ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, తాతయ్య మాస్టారు, హైస్కూల్ ఎన్.సి .సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

**మొదటి పేజీ తరువాయి** గ్రామంలో ఆదివారం ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. మహిళలు, అవ్వ, తాతలతో మాట్లాడి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాడు వైసీపీ పాలకులు గ్రామాలలో అభివృద్ధి చేయకుండా పంచాయతీ నిధులను కొల్లగొట్టారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్, సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాసం లక్ష్మిరెడ్డి, సూర ఆదినారాయణరెడ్డి, గువ్వల పిచ్చయ్య, స్థానిక నాయకులు, మండల నాయకులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒంగోలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**మొదటి పేజీ తరువాయి** సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఒంగోలు నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. నగర సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. త్వరలో ట్రంక్ రోడ్డును విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో లయన్ విజయ కుమార్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నామినేని మోహనరావు, లయన్స్ గవెర్నర్ హరిప్రసాద్, కార్యదర్శి నిమ్మగడ్డ వెంకటేశ్వరావులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ వ్యాఖ్యాతలుగా మాంటిస్సోరి ప్రకాష్, డివి రాఘవ వ్యవహరించారు.

## పేదవారికి భరోసాగా నాగేంద్రచారి

### రూ.23 వేలు సహాయం అందజేసిన విశ్వబ్రాహ్మణ సంఘం

పామూరు, మేజర్‌న్యూస్: ఆర్థికంగా కుదేలైన కుటుంబానికి సాయం చేయడంలో నొస్సం నాగేంద్ర చారి ముందుండారని సంఘ సభ్యులు ప్రశంసించారు. పామూరు పట్టణ ప్రధాన కార్యదర్శిగా కాకుండా బాధితుల బాధను తనది చేసుకున్న వ్యక్తిగా ఆయన చూపిన స్పందన అభినందనీయమని పేర్కొన్నారు. కనిగిరి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నాగేంద్ర చారి సమన్వయంతో రూ.23వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు రాచకొండ శేష బ్రహ్మచారి, గుంపర్లపాటి ఈశ్వరచారి, బొగ్గవరపు కనక రత్నాచారి, తీయబిండి సుబ్బారావు, పత్తిపాటి రంగాచారి, పోలిచర్ల బాల బ్రహ్మచారి, వినుకొండ సురేష్ బాబు, పెరమణా బాలాచారి, గోవిందాచారి తదితరులు పాల్గొన్నారు.



## వ్యాయామ ఉపాధ్యాయులు హజరత్తయ్య ప్రమోషన్‌పై విచారణకు ఆదేశం

సింగరాయకొండ, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ఊళ్ళ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేస్తున్న పిల్లి హాజరత్తయ్య ప్రమోషన్‌పై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశాలు జారీ చేశారు. వెనుకబడిన తరగతుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పొట్టికలపూడి జయరాం ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిసింది. ఈ ఫిర్యాదు పై ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ అక్రమ మార్గంలో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుడిపై పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ స్తంభంపై మంటలు

### – ఆందోళన చెందిన ప్రజలు –



చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాలలో కురుస్తున్న జోరు వానకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి బయట అడుగు పెట్టాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరపక్క కురుస్తున్న వర్షానికి పొలిమేర రోడ్డులోని కరెంట్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు రావడంతో ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. స్తంభం ఉన్న తీగలు షార్ట్ సర్క్యూట్‌కు గురై పెద్ద శబ్దంతో మంటలు ఎగసి పడ్డాయి. పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులు సమాచారం అందించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆయన సతీమణి కందుల వసంత లక్ష్మి టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ అభ్యర్థన మేరకు కుంచేపల్లి గ్రామానికి చెందిన పేరం చిన్న కోటిరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3,09,919 చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కందుల వసంత లక్ష్మిని వరికుంట్ల అనిల్ సురేఖ దంపతులు శాలువాతో సత్కరించి బుద్ధుడి విగ్రహాన్ని బహుకరించారు.

# పట్టణంలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్





కనిగిరి, మేజర్‌న్యూస్: మున్సిపల్ కార్మికులు సమ్మె నేపథ్యంలో మున్సిపల్ కమీషనర్ పి కృష్ణమోహన్ రెడ్డి ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. పామూరు బస్టాండులోని చర్చ్ సెంటర్ వద్ద గల కరెంటు వైర్లు, ఇంటర్నెట్ వైర్లను వర్కర్లు సమ్మెలో ఉన్న కారణంగా కమీషనర్ స్వయంగా తొలగించి పరిసరాలలోని చెత్తను శుభ్రం చేయించారు. అలాగే పామూరు రోడ్డులోని షాపుల వద్ద చెత్త ఉండడంతో గమనించిన కమీషనర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని రోడ్డు మీదకు రాకుండా చూసుకోవాలని సూచనలు ఇచ్చారు. శాసనసభ్యులు డా.ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు శుభ్రపరచిన కొత్తూరు అలుగు ప్రదేశాన్ని పునఃపరిశీలన చేశారు. ఇక మీదట ఆ పరిసరాలను అపరిశుభ్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక 8వ వార్డులోని ప్రజల నీటి సమస్యను తీర్చడం కొరకు స్వయంగా కమిషనరు వాటర్ ట్యాంకును అమర్చి ఆ ఏరియా ప్రజల అవసరాన్ని తీర్చారు. ఏరియాలోని డ్రైనేజ్, స్ట్రీట్ లైట్ సమస్యలను ప్రజలు కమీషనరు దృష్టికి తీసుకుని రాగా, ప్రస్తుతం జరుగుతున్న కార్మికుల సమ్మె విరమించగానే యుద్ధ ప్రాతిపదకన పనులు చేయిస్తాను ఏరియా ప్రజలకు హామీ ఇచ్చారు.




## 5వ రోజు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

గిద్దలూరు, మేజర్‌న్యూస్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 5వ రోజు ఆదివారం కూడా కొనసాగింది. సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికుల తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ చిరు ఉద్యోగులైన తమ కుటుంబాలకి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయవలసిన అవసరం ఉందని, మిగిలిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే రిటైర్మెంట్ వయస్సుని 62 సంవత్సరాలుకి పెంచాలని, జిఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, వీటితోపాటు అన్ని రకాల నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జి.మురళి, రంగయ్య, చంటయ్య, పాపయ్య, బాలయ్య పాల్గొన్నారు.



## అలకాపురం పార్టీ అధ్యక్షుడిగా చల్లపల్లి

పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: అలకాపురం వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడుగా చల్లపల్లి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.మండలంలోని అలకాపురం గ్రామంలో ఎంపీపీ దేందుకూరి సీతారామరాజు అధ్యక్షతన అలకాపురం వైస్సార్సీపీ గ్రామ పార్టీ అధ్యక్షునిగా చల్లపల్లి చంద్రశేఖర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ ఉయ్యూరు లీల శ్రీనివాస్ రెడ్డి, మండల యువజన విభాగ అధ్యక్షులు షేక్ మౌలాలి, రాష్ట్ర ఎస్ఎస్ఎల్ నాయకులు మండే విజయ్ కుమార్, అల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మాజీ చైర్మన్ వాలి శివ రెడ్డి, మండే జాన్ బాబు, మార్పు మోషే, చల్లపల్లి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం




వేటపాలెం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని వేటపాలెం రోటరీ క్లబ్ 2025- 26 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులుగా ఏవి సురేష్ బాబు రెండవసారి ఎన్నిక కాబడ్డారు. కార్యదర్శిగా అక్కల చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారిగా రొండా దశరధరామిరెడ్డి నియమితులు కాగా ఫాస్ట్ గవర్నర్ శివన్నారాయణ ఇన్స్టలేషన్ అధికారిగా అధ్యక్ష, కార్యదర్శులచే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనం ఉంటే చాలదు, సేవా గుణం ఉండాలి. మానవసేవయే మాధవసేవ అనే నినాదంతో ఏర్పడిన ఈ రోటరీ క్లబ్ అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రజల ఆర్థిక అవసరాలు, విద్య, వైద్యం పలు సేవా కార్యక్రమాల్లో ముందుకు పోతుందన్నారు. వేటపాలెం రోటరీ క్లబ్ కూడా అదే తరహాలో సేవలందిస్తూ సురేష్ బాబు అధ్యక్షతన మరింత బలోపేతం కావాలన్నారు. రోటరీ క్లబ్‌లోకి నూతన సభ్యులు చేరిన పోలకం చంద్రశేఖర్‌కు రోటరీ పిన్ అందించి క్లబ్‌లోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, అన్యువల్ గివింగ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కెఎస్ఆర్కె. ప్రసాద్, ఛార్టెడ్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, ఏవీ సురేష్ బాబు, ఏ.చంద్రశేఖర్ రెడ్డి, కొత్త శ్రీనివాసరావు (వాసు), కె.శివరామకృష్ణ, ప్రత్తి వెంకట సుబ్బారావు, బట్ట మోహనరావు, పి.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, ఊట్ల వెంకటేశ్వర్లు, దివి పవన్, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలి పూజ హెూమం



చిన్నగంజాం, మేజర్‌న్యూస్: మండలంలోని మున్నంవారిపాలెం నందు శ్రీ పోలేరమ్మ తల్లి అలయం నూతనంగా నిర్మించి 41 రోజుల మండలి సందర్భంగా శ్రీ పోలేరమ్మ ఆలయంలో ఆలయ పవిత్రీకరణ, శుద్ధి చేసి దైవిక శక్తిని ఆహ్వానించడానికి, ఆలయంలోని వాతావరణాన్ని ఆధ్యాత్మికంగా సమృద్ధం చేయడానికి ఆదివారం మండల పూజ హెూమాన్ని అలయ స్థల ధర్మ కర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైదిక అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన హెూమంలో ఆలయంలోని ప్రధాన దేవతకు షోడశోపచార పూజలు, గణపతిపూజ, కలశస్థాపన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, దీక్షాహెూమం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, స్థల దాతలు, ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## భైరవకోనలో భక్తజన సందడి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలో ఆదివారం భక్త జన సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు దినం కావడంతో పలువురు నాయకులు, భక్తులు, పర్యటకుకు స్థానిక జలపాతం వీక్షించి అనంతరం శ్రీత్రిముఖదుర్గాంబ, కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి ఇతర శివలింగాలను దర్శించుకుని అభిషేకం కుంకుమార్చన పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

## పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి: ఏవో



దర్శి, మేజర్‌న్యూస్: రైతులు తాము చేసుకున్న పంటలకు క్రాపి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కె. రాధ కోరారు. పంట భీమా అనగా ఖరీఫ్ 2025-26 లో "ఫసల్ భీమా" పథకం చివరి తేది ఈ నెల 31 ఆఖరి తేదీ అని ఆమె తెలిపారు. పంట భీమా చేపించాలి అంటే ఖచ్చితంగా డిజిటల్ ఏరియా సౌన్ సర్టిఫికెట్ అనేది కావాలని, మాములుగా ఈ పత్రం పంట య్నెక్క విత్తనాలు లేదా మొక్కలు నాటిన తరువాత గ్రామ వ్యవసాయ అధికారి పంట నమోదు చేసిన తరువాత ఇస్తారు. కానీ ఇపుడు పంట వేసే కాలం కాస్త ఆలస్యం అవుతోంది, మనమే సొంతంగా తెల్ల కాగితంపై మనం ఏ పంట ఐతే వేస్తమో,ఎన్ని ఎకరాలలో వేస్తామో వ్రాతపూర్వకంగా రాసి సంతకం చేసిన తరువాత గ్రామ వ్యవసాయ అధికారికి ఇస్తే ఆయన వెంటనే వాళ్ల యాప్‌లో లేదా వెబ్సైట్‌లో జనరేట్ చేసి మనకు డిజిటల్ ఏరియా సౌన్ సర్టిఫికెట్ ఇస్తారని ఏవో తెలిపారు. ముఖ్యంగా పంట భీమా చెపించాలి అనుకుంటే 'రైతు గుర్తింపు నెంబర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ 3 నెంబర్ కూడా ఉండాలని కోరారు. భీమా పొందే అవకాశం వరికి ఆగస్టు 15 చివరి తేదీ అని అన్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.రాధ కోరారు.

## ధ్యాననారాయణస్వామి పూజల్లో వెంకటేశ్వర్లు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఆదివారం మండలంలోని రెడ్డి గారికొత్తపల్లి గ్రామానికి సమీపంలో నారకొండ ధ్యాననారాయణస్వామి ఆరాధన సంధర్భంగా ప్రముఖ టిడిపి నేత, పామూరు మండలం ఇనిమెర్ల పంచాయతీ ప్రముఖులు, గ్రామ టిడిపి అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు దంపతులు కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు అర్చకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

## పామూరులో ఆర్యవైశ్యుల హర్షధ్వానాలు



పామూరు, మేజర్‌న్యూస్: అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహంతో పాటు స్మృతివనం ఏర్పాటు నిర్ణయంపై పామూరులో ఆర్యవైశ్యులు ఆదివారం ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవంగా భావించిన స్థానిక నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి టీజీ భరత్, ట్రస్ట్ అధ్యక్షుడు డూండీ రాకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు పందిటి హరీష్, దేవస్థాన కమిటీ చైర్మన్ కోట నరసింహారావు, ట్రెజరర్ రాజేష్, సేగు కిష్టయ్య, రాచూరి సాయి, గణేష్, హరి, పబ్బతి నారాయణ తదితరులు సమావేశమై హర్షం వ్యక్తం చేశారు.

## లిక్కర్ స్కాంలో జగన్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం



దర్శి, మేజర్‌న్యూస్: వేలకోట్ల ప్రజల సొమ్ము దోసుకొని దర్జాగా ఇతర దేశాలలో పెట్టుబడులు పెడుతూ తప్పించుకు తిరుగుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జైలుకెళ్లే రోజులు దగ్గరపడ్డాయని దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. మిధున్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, కసిరెడ్డి, చెవిరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, మోహిత్ రెడ్డి ఇలా ఆలీబాబా 40 దొంగల వలె జగన్ అండ్ టీం దాచుకొని దోచుకుని రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపద, లిక్కర్ సంపద, ఇలా ఆంధ్ర రాష్ట్రాన్ని ఐదేళ్లు వినాశనం చేశారని ఆమె విమర్శించారు. వీరందరూ ఒక్కొక్కరు జైలుకు వెళుతున్నారని నిన్న మిథున్ రెడ్డితో జగన్ రెడ్డి కథ కంచికి చేరిందని, ఇక జగన్ రెడ్డి జైలుకు వెళ్లక తప్పదని ఆమె స్పష్టం చేశారు. తప్పించుకునే ందుకు జనం మధ్యకు వచ్చి, జనా న్ని రెచ్చగొడుతూ, జనం చావులకు కారణం అవుతున్నారని ఆమె ఎద్దేవ చేశారు. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఈడీ కేసులు, సిబిఐ కేసుల్లో జగన్ రెడ్డి తప్పించుకోలే దని, జగన్ త్వరలో జైలుకెళ్లడం ఖాయమని ఆమె వివరించారు. కూటమి పాలన లో ప్రజల కోసం, ప్రజల అభివృద్ధి కోసం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం చేస్తున్న కృషి చూస్తున్నాం. అది చూసి ఓర్వలేక కుంభకోణాలలో కూరుకు పోయి ఈడీ కేసులు, సిట్ కేసులు ఎదుర్కొం టున్న జగన్ అండ్ బ్యాచ్ ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రజల్లో చర్చలు జరక్కుండా తప్పుచేసి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు.


## గుంటిగంగలో భక్తుల సందడి



తాళ్లూరు, మేజర్‌న్యూస్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటి గంగా భవాని అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కామేశ్వర శర్మ ప్రకాష్ రావు పంతులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారి పూజారి మెట్టల బాలరాజు యాదవ్, పి.విజయ లక్ష్మి అమ్మవారిని పసుపు కుంకుమ అర్చనలతో, పూలదండలతో, నిమ్మకాయల దండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగల్ పెట్టి నైవేద్యం సమర్పించి ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కే.గురుబ్రహ్మం, రికార్డ్ అసిస్టెంట్ ప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు.







## శ్రీ నాగార్పమ్మతల్లికి ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక పూజలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా నగరంలోని 2వ డివిజన్ బిలాల్ నగర్ నందు సయ్యద్ మస్తాన్ గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నగర పరిధిలోని పెళ్లూరు నందు కటకరి వారి శ్రీ నాగార్పమ్మతల్లి కొలుపులు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ నుండి వల్లూరమ్మతల్లి దేవస్థానం నందు సండాడి వెంకట్ వల్లూరమ్మ తల్లి మొక్కులు సందర్భంగా ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. శాసన సభ్యులు దామచర్ల వెంట పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, పార్టీ ముఖ్య నేతలు, ఆయా డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



## పుట్టవారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు

సంతమాగులూరు, మేజర్‌న్యూస్: పుట్టవారిపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సంతమాగులూరు మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో కార్యక్రమాన్ని ప్రారంభించామని ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించామని త్వరలోనే రైతన్నలకు అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం 2 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం 5 వేలతో 7 వేలు రైతన్నల ఖాతాలకు జమ కానున్నాయని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుండి కూటమి ప్రభుత్వ సారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్నిబోయిన ఏడుకొండలు, అద్దంకి వెంకటేశ్వర్లు, సింబోతుల వీరయ్య, మాదాల సుబ్బారావు, మాబు సైదా కొనికి శ్రీను, బూత్ కన్వీనర్ వెంకట్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గ్రీన్ టాక్స్ తగ్గింపు

**జగన్ పాలనలో రవాణా రంగం కుదేలు**

**పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు, అధిక పన్నుల భారాలు**

**కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు**

**మంత్రి స్వామిని సన్మానించిన ఎస్.కొండ లారీ ఓనర్స్ అసోసియేషన్**





టంగుటూరు, మేజర్‌న్యూస్: కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నాం, ఇచ్చిన మాట ప్రకారం గ్రీన్ టాక్స్ తగ్గించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రవాణా వాహనాలపై గ్రీన్ టాక్స్ తగ్గించినందుకు గానూ ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంప్ కార్యాలయం లో సింగరాయకొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ వైసీపీ హయాంలో వాహనదారులపై రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచి మోయలేని భారం మోపింది. గత 5 ఏళ్ళు ఓ వైపు పెట్రోల్, డీజిల్ ధరలు మరోవైపు పన్నులతో రాష్ట్రంలో రవాణా రంగం కుదేలైంది. నాడు ప్రతిపక్షంలో ఉన్నపుడు రవాణా వాహనదారుల సమస్యలు చూసిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే గ్రీన్ టాక్స్ తగ్గిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఆ హామీ నెరవేర్చారు. ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపినవారిలో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సింగరాయకొండ లారీ అసోసియేషన్ అధ్యక్షులు చిగురుపాటి శేషగిరి, కార్యదర్శి పటేల్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# అల్లూరు నాకు ఎంతో ప్రత్యేకం: డాక్టర్ చాపల వంశీకృష్ణ

## శ్రీరామ్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన





ఒంగోలు, మేజర్‌న్యూస్ : కొత్తపట్నం మండలం అల్లూరులోని మండపం సెంటర్లో డాక్టర్ చాపల వంశీకృష్ణ మిత్ర బృందం అల్లూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి టూ టౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ తనకు ఎంతో ఆత్మీయుడని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ ఎంతో మందికి సేవ చేస్తూ, వైద్య పరంగానే కాకుండా పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు కృషి చేస్తున్నారని తెలియజేశారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ అల్లూరు గ్రామం తనకు ఎంతో ప్రత్యేకమైనదిగా భావిస్తానని, ఇక్కడ వారు ఎంతోమంది కొత్తపట్నం హైస్కూల్లో చదువుకున్నారని, వారిలో తన స్నేహితులు, సీనియర్లు జూనియర్లు ఉన్నారని, ఈ గ్రామ ప్రజలు తనను తమ సొంత కుటుంబ సభ్యుని లాగా పరిగణిస్తారని, ఎంతో ప్రత్యేకమైన అనుబంధం కలిగి ఉందని తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 320 మందికి ఉచితంగా ఓపి, బిపి, షుగర్, ఈసీజీ, పాదాల నరాల స్పర్శ పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి సహాయ సహకారాలు అందించి విజయవంతం చేసిన డాక్టర్ చాపల వంశీకృష్ణ స్నేహ బృందం శాంతారావు, తిరుమలేశ్వర్ రావ్ బెంగళూరు జాలయ్య, వేణు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం హరిబాబు ప్రసాదు, ఆరుమూరి శ్రీనుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి, ప్రముఖ జనరల్, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, ప్రముఖమెదడు, వెన్నుముక శాస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ షేక్ వలి బాబు, ప్రముఖ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ దోనే సృజన్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ నందలూరు సరయు, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు గోపి, అనిల్, రజనీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మహత్యాయత్నం నుంచి కాపాడిన వెదుళ్లపల్లి ఎస్సై



సూర్య ప్రతినిధి, బాపట్ల: ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయని వాటిని సానుకూలంగా చర్చలతో పరిష్కరించుకోవాలని కుదరని ఎడల పోలీసులను సంప్రదించాలన్నారు ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని జీవితాలకు ఆత్మహత్య రూపంలో ముగింపు పలకడం అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు జిల్లా ఎస్పీ తుషార్ డూడి. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పై ఒక మహిళ తన ఇద్దరి కుమార్తెలతో ఆదివారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమయ స్ఫూర్తిగా వ్యవహరించి వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా వారి ప్రాణా లను కాపాడారు. వివరాలలోకి వెళితే.. ఒక మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు కాల్ వచ్చింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలు మేరకు వెదుళ్ళపల్లి ఎస్సై త్వరితగతిన స్పందించి వారి సిబ్బందిని వెంటపెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని, స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన మహిళ, ఆమె కుమార్తెలను చాకచక్యంగా వ్యవహరించి కాపాడారు. వారు ఆత్మహత్యకు యత్నించడానికి దారి తీసిన కారణాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. నివాసానికి వెళ్లి ఇరువురికి కుటుంబ విభేదాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగతంగా కుటుంబ పరంగా ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయన్నారు. వాటిని సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలన్నారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఎలాంటి ఒత్తిడిలోనైనా ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ శక్తి బృందాలను ఏర్పాటు చేసిందని, మహిళలపై వేధింపులు, గృహ హింస, కుటుంబ విభేదాల వంటి సమస్యల పరిష్కారానికి మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం అందుబాటులో ఉందని, జిల్లా ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 100, 112 నెంబర్ల నుండి వచ్చే కాల్స్ పట్ల పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలన్నారు. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనే దానికి నిదర్శనమన్నారు. వేగంగా స్పందించి ముగ్గురి నిండు ప్రాణాలను కాపాడిన వేదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్ ని వారి సిబ్బందిని అభినందించారు.

# ప్రతి సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు: ఎస్పీ



సూర్య ప్రతినిధి, బాపట్ల: ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయని వాటిని సానుకూలంగా చర్చలతో పరిష్కరించుకోవాలని కుదరని ఎడల పోలీసులను సంప్రదించాలన్నారు ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని జీవితాలకు ఆత్మహత్య రూపంలో ముగింపు పలకడం అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు జిల్లా ఎస్పీ తుషార్ డూడి. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పై ఒక మహిళ తన ఇద్దరి కుమార్తెలతో ఆదివారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమయ స్ఫూర్తిగా వ్యవహరించి వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా వారి ప్రాణాలను కాపాడారు. వివరాలలోకి వెళితే ఒక మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ కు కాల్ వచ్చింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలు మేరకు వెదుళ్ళపల్లి ఎస్సై త్వరితగతిన స్పందించి వారి సిబ్బందిని వెంటపెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని, స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ పై ఆత్మహత్యకు యత్నించిన మహిళ, ఆమె కుమార్తె లను చాకచక్యంగా వ్యవహరించి కాపాడారు. వారు ఆత్మహత్యకు యత్నించడానికి దారి తీసిన కారణాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ వివాదాల నేపథమే కారణమని తెలుసుకొని, వారి నివాసానికి వెళ్లి ఇరువురికి కుటుంబ విభేదాల పై కౌన్సిలింగ్ నిర్వహించి, కుటుంబ సమస్యలను పరస్పర చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించి, వారిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగతంగా కుటుంబ పరంగా ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయన్నారు. వాటిని సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాల న్నారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఎలాంటి ఒత్తిడిలోనైనా ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ శక్తి బృందాలను ఏర్పాటు చేసిందని, మహిళలపై వేధింపులు, గృహ హింస, కుటుంబ విభేదాల వంటి సమస్యల పరిష్కారానికి మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం అందుబాటులో ఉందని, జిల్లా ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 100,112 నెంబర్ల నుండి వచ్చే కాల్స్ పట్ల పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలన్నారు. తద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడడానికి ఆస్కారం ఉంటుందన్నారు. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనే దానికి నిదర్శనమన్నారు. వేగంగా స్పందించి ముగ్గురి నిండు ప్రాణాలను కాపాడిన వేదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్ ని వారి సిబ్బందిని అభినందించారు.



## శాకాంబరీ దేవిగా అల్లూరమ్మ అమ్మవారి దర్శనం

పిట్టలవానిపాలెం మేజర్ న్యూస్ : మండలంలోని అల్లూరు గ్రామంలో కొలువై ఉన్న భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న అల్లూరమ్మ తల్లికి ఆదివారం వివిధ రకాల కూరగాయలు పండ్లతో అమ్మవారిని శాకాంబరి గా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని సేవించి తన్మయులైనారు. నాకములను ధరించి మానవాళికి సకల శాకములను ప్రసాదించి, మనోభీష్టాను నెరవేర్చే మాతగా ఆషాడ మాసంలో అమ్మవారిని ఆరాధించటం ఎంతో శ్రేష్ఠమని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి శివ సుబ్రమణ్యం తెలిపారు. ఈ శాకాంబరి పూజా ఫలితంగా మనవాళ్ళ సకల దోషములు తొలిగి పోయి ఆయురారోగ్యములు, అష్టైశ్వర్యయాలు సిద్ధిస్తాయని తెలిపారు. శాకాంబరి అమ్మగా అలంకరణ పూజ కార్యక్రమాల దాతలు అల్లూరు వైద్యులు రాదె శ్రీనివాస్ లక్ష్మి దంపతుల చేతుల మీదుగా అమ్మ వారికి సారె సమర్పించారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



అద్దంకి, మేజర్‌న్యూస్: గత ఎనిమిది రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు భారత్ కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సిపిఐ ఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యు లు ఆంద్రా మాల్యాద్రి తెలియజేశారు. అద్దంకి మున్సిపల్ ఆఫీస్ వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేయటం జరిగింది. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకుండా దుర్మార్గ వైఖరి అవలంబించిందని అదే విధానాన్ని ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అవలంబిస్తుందని అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టిడిపి అధికారంలో ఉన్నంగా ఇచ్చిన జీవో నెంబర్ 36 అమలు చేయాలని చిత్తశుద్ధితో కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రోజువారి అవసరమైన నిత్యవసర వస్తువులు గణనీయంగా పెరిగిపోయి కార్మికులు జీవనస్థితిగతులు దయనీయంగా ఉన్నాయని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాల్సిందే పోయి ప్రభుత్వం కాలయాపన చేస్తూ కార్మికులను తీవ్ర ఇబ్బం దులకు గురి చేయటం సిపిఎం పార్టీ వ్యతిరేకిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి వెంటనే కార్మికులతో చర్చలు జరిపి ఈ సమ్మెను విరువంప చేయాల్సి నా బాధ్యత వారిపై ఉందని అలా చేయని పక్షంలో సమ్మెను కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం. ఐలు నాయకులు డి గంగాధర్. ఇంజనీరింగ్ విభాగం నాయకులు ఉసురు పాటి శామ్యూల్, జి మార్కు కె మారుతి, డిజాషువా, ఎం కోటేశ్వరరావు, ఎం రమేష్ ఉన్నారు.

## గుంతల రహదారులు - ప్రజల అవస్థలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సి.ఎస్.పురం పట్టణంలో ప్రధాన రహదారులు పెద్దగుంతలుగా చినుకుపడితే వాహనదారులు ప్రజల అవస్థలు వర్ణనాతీతం. మండలకేంద్రమైన సిఎస్ పురంలో డిజిపేట వెళ్లే ప్రధాన రహదారి బెల్లంకొండ కళాశాల సమీపంలో ఇటీవల జాతీయ రహదారుల భారీవాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటం వలన రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీరుచేరి బురదమయంగా తయారై వాహనదారులకు ప్రజలకు తీవ్రఇబ్బందులు ఏర్పడి అవస్థలు పడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రహ దారుల మరమ్మతులకు నిధులు కేటా యించినట్లు ప్రకటించినా మండలం లో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారులు రహదారుల మరమ్మతు లకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. వెంటనే సంబంధిత అధికారులు సి.ఎస్.పురం నుండి డిజిపేట వెళ్లేమార్గం బెల్లంకొండ కళాశాల సమీపంలో అదేవిధంగా సిఎస్ పురం నుండి పామూరు వెళ్లే మార్గం పెట్రోలు బంక్ సమీపంలో రహదారులు మండలంలో పలుగ్రామా లలో పంచాయతీరాజ్ రహదారులు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను, ప్రజాప్రతినిధులను పలువురు కోరుతున్నారు.




## రెండో మహాసభలను జయప్రదం చేయాలి: మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

అద్దంకి, మేజర్‌న్యూస్: దేశంలో లౌకిక ప్రజాస్వామ్య సమసమాజ స్థాపనే ధ్యేయంగా1925లో కాన్పూర్ లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ స్థాపించబడిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఈనెల 23న అద్దంకిలో జరగనున్న బాపట్ల జిల్లా సిపిఐ రెండవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ అద్దంకి సిపిఐ కార్యాలయం (భూపేష్ భవన్) నందు మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కామ్రేడ్ జల్లి విల్సన్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ స్థాపితం జరిగి 100 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాత్మక మహాసభలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దళితులకి గిరిజనులకు కావాల్సిన హక్కులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈనెల 23న అద్దంకిలో తలపెట్టిన సిపిఐ జిల్లా రెండవమహాసభల సందర్భంగా ఉదయం 11 గంటలకు స్థానిక సిపిఐ కార్యాలయం (భూపేష్ భవన్) నుండి వెయ్యి మంది సిపిఐ శ్రేణులు బంగ్లా రోడ్డు వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించి బంగ్లా రోడ్డులో ఈ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు కామ్రేడ్ మానం వెంకటనారాయణ పేరు మీద ఏర్పాటు చేసిన సభా వేదిక నందు గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామ్రేడ్ షేక్ ఖాదర్ బాషా, ప్రధాన కార్యదర్శి తుమ్మల పూర్ణచంద్ర శేఖర్, కార్యదర్శి గర్నెపూడి ప్రసాద్ కోశాధికారి కే ఎల్ డి ప్రసాద్ పాల్గొన్నారు.



## వైభవంగా గోమాతకు సీమంతం వేడుకలు

అద్దంకి, మేజర్‌న్యూస్: గోమాతకు సీమంతం వేడుకలు మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం వైభవంగా జరగాయి. ఆవును పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంపదలు లభిస్తాయని అందరూ నమ్ముతారు. గోమాతకు సీమంతం చేసి భక్తిని చాటుకున్న ఘటన మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన అల్లంనేని పూర్ణ చంద్రరావు పద్మజ దంపతులు తమ డ్రాగెన్ ఫ్రూట్ తోట వద్ద ఘనంగా నిర్వహించారు. గోమాతకు పసుపు, కుంకుమ రాసి, కొత్త వస్త్రాలు సమర్పించి గో ప్రదక్షిణలు చేశారు. సీమంతం కార్యక్రమంలో పూర్ణ చంద్రరావు కుటుంబ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## మానవత ఆర్థిక చేయూత




దర్శి, మేజర్‌న్యూస్: స్థానిక లంకోజనపల్లి రోడ్ నందు నివాసముంటూ మూలే రఘురామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. మృతునికి ఇద్దరు అమ్మాయిలతో కుటుంబ పోషణ భారమైన ఒక నిరుపేద మహిళ పరిస్థితిని యాదృచ్ఛికంగా చూసి చలించిపోయిన ‘దరిశి మానవత స్వచ్ఛంద సేవాసంస్థ’ సభ్యులు మానవతా ధృక్పదంతో వారిని అక్కున చేర్చుకొని వారి కుటుంబ అవసరాల నిమిత్తం ఆర్థిక చేయుత నిచ్చారు.మానవత సంస్థ తరుపున రూ.5వేలు, దాతల సహకారంతో రూ.10516లు మొత్తం రూ.15,516లను శనివారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

## శ్రీ బురకాయలంకమ్మ ఆలయంలో అన్నదానం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం పంచాయతీలోని ఎం వి రాజుపాలెంలో వేయించేసియున్న ఆట్ల వారి కులదేవర శ్రీ బురకాయల అంకమ్మ తల్లికి ఆషాడ మాసం సందర్భంగా మహిళలు విశేష పూజలు నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ పెద్దల సహకారంతో ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంను గ్రామపెద్దలు పర్యవేక్షించారు

## ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

టంగుటూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని టంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల బుచ్చి రాజుపాలెం సమీపంలోని చిల్ల చెట్లలో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్ సహాయముతో ఏడు మంది పేకాటరాయుళ్లు అరెస్ట్ చేసినట్లు ఎస్సై వి.నాగమల్లేశ్వర తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ సిహెచ్ హాజరత్తయ్య పర్యవేక్షణలో ఎస్సై నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో డ్రోన్ సహాయముతో పేకాట ఆడు తున్న వారిని గుర్తించి ఏడు మందిని పట్టుకొని వారి వద్ద నుండి రూ.14, 840 నగదును చేసుకున్నారు. అరెస్టు చేసిన పేకాటరాయుళ్లను కోర్టుకు హాజరపరచనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని కట్టడి చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.